


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




ఆదివారం 01-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 262 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## స్పీకర్ విచారణకు కడియం హాజరు మార్చి తొలి వారంలో తుది నిర్ణయం?




## అత్తారింట్లో 'కజ్జికాయ' రగడ


### పోలీసులకు ఫిర్యాదు చేసిన చిన్న అల్లుడు!




## ప్రభుత్వాసుపత్రికి మారువేషంలో కలెక్టర్.. రోగి లాగా ప్రవేశం




## స్టవ్‌లు రిపేర్ చేసుకునే వ్యక్తిని వరించిన అదృష్టం




## కన్నతల్లిని సజీవ దహనం చేసిన కొడుకు




## ఉరేసుకుని మహిళా కానిస్టేబుల్ బలవన్మరణం




## కాకినాడ పేలుళ్లు.. మృతి చెందింది వీరే..!




# మహిళా మంత్రి మీటింగ్‌కు డుమ్మా..

## ఐఏఎస్ అధికారిపై ఏకంగా సస్పెన్షన్ వేటు




న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): మహారాష్ట్రలో ఉన్నతాధికారుల తీరుపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. పర్యావరణ శాఖ మంత్రి పంకజా ముండే పిలిచిన సమీక్షా సమావేశానికి డుమ్మా కొట్టారని, మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ దేవేంద్ర సింగ్, జాయింట్ డైరెక్టర్ సతీష్ పద్వాల్లను సస్పెండ్ చేస్తూ అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నారు.

అసెంబ్లీ వేదికగా సంచలన నిర్ణయం..

చంద్రాపూర్ జిల్లాలోని కాలుష్య నివారణ చర్యలపై శాసనసభలో చర్చ జరుగుతున్న సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై తాను పిలిచిన బ్రీఫింగ్ సమావేశాలకు ఎంపీసీబీ అధికారులు వరుసగా గైర్హాజరవుతున్నారని మంత్రి పంకజా ముండే సభ దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల సమన్వయ లోపం వల్ల ప్రజా సమస్యలపై సమాధానం చెప్పడం ఇబ్బందిగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, మంత్రి ఫిర్యాదుపై ప్రోటెమ్ స్పీకర్ దిలీప్ లాండే తీవ్రంగా స్పందించారు. ప్రజాప్రతినిధులు పిలిచిన సమావేశాలకు రాకపోవడం అనేది సభా మర్యాదను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు.

# నాకు రెండు సార్లు మోసం జరిగింది

## ఈ సారి రాజ్యసభ చాన్స్ ఇవ్వండి




న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాల్లో రాజ్యసభ రాజ్యసభ ఎన్నిక ఆసక్తిగా మారింది. రాష్ట్రం నుంచి రెండు స్థానాలకు జరగనున్న ఎన్నికలో అవకాశం కోసం టీ కాంగ్రెస్ లో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. అవకాశం దక్కితే చాలు గెలుపు ఖాయమనే అంచనాలతో ఈ చాన్స్ వదులుకోవద్దని పార్టీలోని సీనియర్లంతా ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సీనియర్ నేత వి.హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి పార్టీలో నా పనిని చూసి తప్పనిసరిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఇవాళ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్టీలో పని చేసే వారికే అవకాశం ఉంటుందని మొన్ననే వికారాబాద్ లో జరిగిన డీసీసీ శిక్షణ తరగతుల్లో సీఎం రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్ చెప్పారని పార్టీలో నేను పని చేస్తూనే ఉన్నానని కావాలని ఏమి అడగడం లేదన్నారు. నా ఎబిలిటి చూసి అవకాశం ఇవ్వాలన్నారు. ఈ పదేళ్లలో అందరికంటే ఎక్కువ కేసులు నామీదే నమోదయ్యాయని అయినా నేను భయపడలేదన్నారు. కాంగ్రెస్ సిపాయిగా, ఇందిరాగాంధీ కుటుంబానికి లాయల్ గా పని చేస్తున్న తనకు అధిష్టానం మీద, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మీద నమ్మకం ఉందన్నారు.

# విజయ్, ఓపీఎస్, శశికళ మద్దతుతో

# స్టాలిన్‌కు 2009 ఏపీ రిపీట్ అవకాశం




న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ఎంతో కాలంగా అన్నాడీఎంకే, డీఎంకే కూటముల మధ్య పోరు ఉండగా.. ఇప్పుడు విజయ్‌కి చెందిన టీవీకే సైతం పోటీలోకి వచ్చింది. దీంతో త్రిముఖ పోరు జరిగే అవకాశం కనిపిస్తోంది. స్టాలిన్ సీఎం పీఠాన్ని నిలబెట్టుకుంటారా? లేదా అన్నాడీఎంకే అధికారంలోకి వస్తుందా? విజయ్ కింగ్ మేకర్ అవుతారా? అనేది తమిళనాడు ప్రజలకే కాకుండా దక్షిణాది మొత్తానికి ఆసక్తి కలిగిస్తోంది. అయితే అధికారంలో ఉన్న డీఎంకేకి పరిస్థితులు అనుకూలంగా ఉన్న సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్నాడీఎంకే నుంచి బయటకొచ్చిన పన్నీరు సెల్వం డీఎంకేలో చేరారు. జయలలితకు నమ్మిన బంటు అయిన ఓపీఎస్.. గతంలో తమిళనాడు సీఎంగానూ పని చేశారు. అయితే పళనిస్వామితో పొసగకపోవడంతో ఆయనను పార్టీ నుంచి బహిష్కరించగా.. అన్నాడీఎంకేకు బద్ధశత్రువైన డీఎంకే గూటికి చేరారు.

జయలలిత సన్నిహితురాలైన శశికళ సైతం సొంత పార్టీ పెడుతున్నట్లు ప్రకటించారు. జయలలిత చనిపోయాక ఆమె సీఎం అవుతారని భావించారంతా. అయితే అక్రమాస్తుల కేసులో శశికళ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో పన్నీరు సెల్వంకు అధికారం దక్కొద్దనే భావనతో ఆమె పళనిస్వామిని సీఎం అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఆ తర్వాత ఈపీఎస్, ఓపీఎస్ ఒక్కటై శశికళను పార్టీ నుంచి బహిష్కరించారు. ఇప్పుడు శశికళ పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేస్తే అన్నాడీఎంకేకు ఎక్కువగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## యుద్ధం మీరు మొదలు పెట్టారు.. మేం ముగిస్తాం

### ఇరాన్ తీవ్ర హెచ్చరికలు

- టెహ్రాన్‌పై సంయుక్త వైమానిక దాడులు
- సైనిక స్థావరాలే ప్రధాన లక్ష్యం
- అణుఊర్జా కేంద్రాల వద్ద భారీ పేలుళ్లు
- ఇరాన్ నుంచి ఘాటు ప్రతిస్పందన
- పౌరులకు ముందస్తు భద్రతా అలర్ట్



# పైరవీలకు చెక్.. సీనియారిటీకే మొగ్గు

## ఐఏఎస్ బదిలీలపై సీఎం రేవంత్ మార్క్!

- ☐ 2019 బ్యాచ్‌కు కలెక్టర్ పోస్టులు
- ☐ కలెక్టర్ పోస్టు.. ప్రతి ఐఏఎస్ లక్ష్యం
- ☐ ఫీల్డ్ అనుభవానికి ప్రాధాన్యం
- ☐ బీఆర్ఎస్ హయాంలో లాబీయింగ్ ఆరోపణలు
- ☐ సీనియర్లకు న్యాయం చేస్తున్న రేవంత్ సర్కారు
- ☐ పనితీరు ఆధారంగా పదోన్నతులు
- ☐ సీఎస్ పోస్టుకు కలెక్టర్ అనుభవం కీలకం

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): 'ఎలాంటి పైరవీలు, లాబీయింగ్ లేకుండా.. సీనియార్టీ ప్రకారం ప్రతి ఒక్క ఐఏఎస్‌నూ కలెక్టర్‌గా నియమిస్తున్నాం. అక్కడ సమర్థవంతంగా పనిచేసిన అధికారులకు హెచ్‌ఓడీగా బాధ్యతలు అప్పగిస్తాం. అక్కడ కూడా ప్రభుత్వ ప్రయారిటీలకు అనుగుణంగా పని చేస్తే.. వారిని వివిధ శాఖలకు సెక్రెటరీలుగా అపాయింట్ చేస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు తెలిసింది. తాజాగా చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. తాజా ట్రాన్స్ ఫర్స్‌లో 2019 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐఏఎస్‌లను వివిధ జిల్లాలకు కలెక్టర్లుగా నియమించారు. అంతకుముందు సదరు ఐఏఎస్‌లు అదనపు కలెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లుగా పనిచేశారు. దీంతో ఆ తర్వాత బ్యాచ్‌లకు చెందిన ఐఏఎస్‌లు సైతం త్వరలోనే తమకు కూడా కలెక్టర్లుగా పనిచేసే అవకాశం వస్తుందనే ధీమాలో ఉన్నారు.

మిగతాది 2 లో



## పరీక్షా కేంద్రంలో విషాద ఘటన

### టాయ్‌లెట్‌లో మృత శిశువు జననం

- ఇంగ్లిష్ పరీక్ష మధ్యలో అనుమానం
- సిబ్బందికి షాక్ కలిగించిన దృశ్యం
- పరువు భయంతో దాచినట్లు వెల్లడి
- పోలీసుల విచారణ, పోక్సో కేసు అవకాశం




## దేశవ్యాప్త హెచ్‌పివి టీకా కార్యక్రమానికి శ్రీకారం

- అజ్మీర్‌లో ప్రధాని ప్రారంభం
- 14 ఏళ్ల బాలికలే లక్ష్యం
- గర్భాశయ క్యాన్సర్ నివారణే ఉద్దేశ్యం
- ఏడాదికి 1.15 కోట్ల మందికి టీకా లక్ష్యం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 01-03-2026

# పైరవీలకు చెక్.. సీనియారిటీకే మొగ్గు ఐఏఎస్ బదిలీలపై సీఎం రేవంత్ మార్క్!

మొదటి పేజీ తరువాయి

కలెక్టర్ పోస్టు.. ఐఏఎస్‌ల డ్రీమ్: ప్రతి ఐఏఎస్ అధికారి తన కెరీర్‌లో జిల్లా కలెక్టర్‌గా పనిచేయాలని డ్రీమ్ పెట్టుకుంటారు. ఎందుకంటే కలెక్టర్ ఆ జిల్లాకు బాస్. ఆయన కనుసన్నల్లోనే ప్రతి ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుంది. జిల్లా పాలనా యంత్రాంగం మొత్తం ఆయన ఆధీనంలో పనిచేస్తుంటుంది. దీంతో ఐఏఎస్‌లు కలెక్టర్‌గా పనిచేసేందుకు పోటీ పడుతుంటారు. సర్వీసులోకి వచ్చిన రెండు, మూడేళ్ల నుంచే ఆ పోస్టులో కూర్చునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు.

నాటి సర్కారులో లాబీయింగ్‌కు ప్రయారిటీ: బీఆర్ఎస్ హయాంలో కలెక్టర్‌గా పనిచేయాలంటే సమర్థతతో సంబంధం లేకుండా పైరవీలు, లాబీయింగ్ చేసిన ఐఏఎస్‌లకే ప్రయారిటీ ఇచ్చే వారనే విమర్శలు ఐఏఎస్ వర్గాల్లో ఉన్నాయి. 'గత సర్కారులో కేవలం లాబీయింగ్ చేసిన అధికారులకే కలెక్టర్లుగా పనిచేసే అవకాశం వచ్చేది. పాలనలో ఎంత సమర్థవంతంగా పనిచేసినా.. పట్టించుకునే వారు కాదు. దీంతో కొందరికి కలెక్టర్లుగా పనిచేసే అదృష్టం దక్కలేదు' అని ఓ సీనియర్ ఐఏఎస్ నాటి సర్కారులో ఎదుర్కొన్న అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత సర్కారులో మాత్రం అందుకు విరుద్ధంగా సీనియార్టీ ప్రకారం ఐఏఎస్‌లు అందరినీ కలెక్టర్‌గా అపాయింట్ చేయడం శుభపరిణామం అని ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. 'బోయి విజయేంద్రకు ఐఏఎస్‌గా 2006లో ప్రమోషన్ వచ్చింది. సమర్థురాలైన అధికారిగా ఆమెకు పేరు ఉంది. కానీ, కేసీఆర్ హయాంలో ఆమెను కలెక్టర్‌గా నియమించలేదు. ఆమె కంటే జూనియర్లు, నాన్ ఐఏఎస్‌లను కలెక్టర్లుగా అపాయింట్ చేశారు. కానీ, రేవంత్ సర్కారులో మాత్రం ఆమెను మహబూబ్ నగర్ కలెక్టర్‌గా నియమించారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆమె పనితీరును చూసి ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్స్, ఎస్సీ శాఖకు కమిషనర్‌గా నియమించారు' అని ఓ ఐఏఎస్ అధికారి వివరించారు.

కలెక్టర్‌గా పనిచేసిన వారికే సీఎస్‌గా చాన్స్!: ప్రతి ఐఏఎస్ తన కెరీర్ చివరలో చీఫ్ సెక్రెటరీగా పనిచేసి రిటైర్డ్ కావాలని ఆశపడుతుంటారు.అయితే, ప్రభుత్వ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించాలంటే సదరు ఐఏఎస్‌కు కలెక్టర్ గా పనిచేసిన అనుభవం ఉందా? లేదా? అని చూస్తుంటారు. ఎందుకంటే కలెక్టర్‌గా పనిచేసిన అనుభవమున్న అధికారికి ప్రభుత్వ స్కీమ్స్ అమలు, విపత్తుల నిర్వహణ ఎలా చేయాలో ఫీల్డ్ అనుభవం ఉంటుంది. దీంతో సీఎస్ హోదాలో ఉన్న అధికారి పాలనా యంత్రాంగాన్ని సులువుగా మానిటరింగ్, గైడెన్స్ చేస్తుంటారు.

# యుద్ధం మీరు మొదలు పెట్టారు.. మేం ముగిస్తాం.. ఇరాన్ తీవ్ర హెచ్చరికలు



న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు దేశవ్యాప్తంగా సుమారు 30కి పైగా కీలక ప్రాంతాలపై ఇజ్రాయెల్– అమెరికా వైమానిక దళాలు ఉమ్మడిగా క్షిపణి దాడులకు దిగాయి. ఎవరూ ఊహించని రీతిలో జరిగిన ఈ మెరుపు దాడులతో టెహ్రాన్ సహా ఇతర నగరాలు బాంబుల మోతతో దద్దరిల్లాయి. ముఖ్యంగా సైనిక స్థావరాలే లక్ష్యంగా జరిగిన ఈ దాడులు ఇరాన్ రక్షణ వ్యవస్థను గట్టిగా దెబ్బతీశాయి. మిలటరీ స్థావరాలే లక్ష్యంగా ఎటాక్స్.. లయన్స్ రోర్ పేరుతో ఇజ్రాయెల్ ఆపరేషన్, టెహ్రాన్, ఇస్ఫహాన్ సహా కీలక నగరాల్లో ఈ దాడులు జరిగాయి. ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ లక్ష్యంగా సాగుతున్న ఈ దాడులతో ఇస్ఫహాన్ లో భారీ పేలుళ్లు సంభవిస్తున్నాయి.

ఈ దాడులపై ఇరాన్ ప్రభుత్వం అత్యంత ఘాటుగా స్పందించింది. తమ దేశ సార్వభౌమాధికారంపై జరిగిన ఈ దాడికి ప్రతిదాడి భీకర స్థాయిలో ఉంటుందని హెచ్చరించింది. "యుద్ధాన్ని మీరు ప్రారంభించి ఉండవచ్చు.. కానీ దీని ముగింపు మాత్రం మా చేతుల్లోనే ఉంటుంది" అని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది. ఎవరూ ఊహించని రీతిలో ఈ యుద్ధానికి ముగింపు పలుకుతామని, ఇజ్రాయెల్ మరియు అమెరికా దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ తీవ్రస్థాయిలో వార్నింగ్ ఇచ్చింది. ఇదిలా ఉంటే ఇరాన్ దాడులు చేస్తుందని ముందే ఉహించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ నేరుగా పౌరుల సెల్ ఫోన్లకు అలర్ట్ సందేశాలను పంపుతూ, అందరూ సురక్షిత ప్రాంతాలకు సమీపంలో ఉండాలని ఆదేశించింది. క్షిపణి దాడులు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలను ముందస్తుగా సిద్ధం చేసేందుకు ఈ 'ప్రోయాక్టివ్ అలర్ట్' జారీ చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది.

# నాకు రెండు సార్లు మోసం జరిగింది ఈ సారి రాజ్యసభ చాన్స్ ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

చాలా మంది ఫోన్లు చేస్తున్నారు: రాజ్యసభ అవకాశంపై చాలా మంది కార్యకర్తలు నాకు ఫోన్లు చేస్తున్నారని అన్నారు. తనకు పోన్లు చేస్తున్న వారికి ఒక్కటే చెబుతున్నాను. మనం పని చేసుకుంటూ వెళ్దాం. మిగతాది హైకమాండ్ మీద వదిలేదామన్నారు. నా జీవితంలో ఎవరికి అన్యాయం చేయలదేని నాకు న్యాయం జరుగుతుందన్నారు. నాకు రెండు సార్లు అన్యాయం జరిగినా పార్టీ జెండానే మోస్తున్నానని అన్నారు. తనకు అవకాశం కోసం సీఎం రేవంత్ రెడ్డితో మల్లికార్జున ఖర్గేను కలిశానన్నారు. సోనియా గాంధీకి లేఖ రాశానన్నారు. గడిచిన పదేళ్లలో తనకు ఎలాంటి పదవి లేదని బీసీ బిడ్డనైన తనకు ఈసారి అవకాశం దక్కుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. నాకు జాతీయ రాజకీయాల్లో పరిచాయాలు ఉన్నాయని రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలంటే నేను ఢిల్లీలో ఉంటే మిగతా రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటానన్నారు. పార్టీ బలపడాలంటే బలమైన వ్యక్తులకు అవకాశం దక్కాలన్నారు.

# స్పీకర్ విచారణకు కడియం హాజరు అనర్హత పిటిషన్‌పై ఉత్కంఠ



న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ఉత్కంఠ రేపుతోంది. శనివారం స్పీకర్ విచారణకు స్టేషన్ ఘన్?పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. కడియం శ్రీహరి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆయన ఎమ్మెల్యే పదవిపై వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట కడియం శ్రీహరి విచారణకు హాజరయ్యారు. గత విచారణ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే తరఫు అడ్వకేట్లను కడియం శ్రీహరి తరఫు అడ్వకేట్లు క్రాస్ ఎగ్జాజ్ చేశారు. ఇవాళ కడియం శ్రీహరి తరఫు అడ్వకేట్లను బీఆర్ఎస్ ఎమ్మెల్యే తరఫు అడ్వకేట్లు క్రాస్ ఎగ్జామ్ చేయబోతున్నారు.

మార్చి మొదటి వారంలో జడ్జిమెంట్!

పార్టీ ఫిరాయింపులపై మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు రాగా ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై తీర్పు వెలువడింది. ఇక దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన పిటిషన్లపై మాత్రమే విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో నిన్నటి విచారణకు దానం నాగేందర్ గౌర్హాజరు అయ్యారు. దీంతో ఆయనకు సంబంధించిన పిటిషన్‌పై తదుపరి విచారణ మార్చి2కు స్పీకర్ వాయిదా వేశారు. ఇక కడియం శ్రీహరి విచారణపై శనివారం విచారణ పూర్తయితే మార్చి మొదటి వారంలో దానం నాగేందర్ పై దాఖలైన పిటిషన్ పై విచారణ పూర్తి చేసి వీరిద్దరికి సంబంధించిన పిటిషన్లపై తీర్పు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అత్తారింట్లో 'కజ్జికాయ' రగడ పోలీసులకు ఫిర్యాదు చేసిన చిన్న అల్లుడు!

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): అనంతపురం జిల్లాలో చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అత్తగారింటికి వెళ్లిన ఓ అల్లుడు చేసిన పని ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అల్లుళ్ళు తమ అత్తగారింటికి వెళ్లారు. మర్యాదల్లో భాగంగా అత్తింటి వారు మొదటి ఇద్దరు అల్లుళ్లకు కజ్జికాయలు వడ్డించారు. అయితే, మూడవ అల్లుడికి మాత్రం కజ్జికాయలు పెట్టకపోవడంతో ఆయన తీవ్ర అవమానంగా భావించాడు. వెంటనే "ఇద్దరు అల్లుళ్లకు ఇచ్చి నాకు ఎందుకు ఇవ్వలేదు? ఇదేం మర్యాద?" అంటూ ఆగ్రహంతో ఊగిపోయిన చిన్న అల్లుడు.. ఏకంగా డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ విచిత్ర సంఘటన అనంతపురం జిల్లా ఉరవకొండలో చోటు చేసుకుంది. చిన్న అల్లుడి నుంచి వచ్చిన ఈ విచిత్ర ఫిర్యాదుతో పోలీసులు కూడా అవాక్కయ్యారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్, అక్కడ ఉన్న ముగ్గురు అల్లుళ్లకు స్వయంగా కజ్జికాయలను పంపిణీ చేసి గొడవను సద్దుమణిగించారు. అల్లుడి అలక తీరడం, పోలీసులు స్వయంగా జోక్యం చేసుకోవడంతో ఈ 'కజ్జికాయ వివాదం' సుఖాంతమైంది. సోషల్ మీడియాలో ఈ వార్త వైరల్ కావడంతో, "కజ్జికాయ కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడమా?" అంటూ నెటిజన్లు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు.

# మహిళా మంత్రి మీటింగ్‌కు డుమ్మా.. ఐఏఎస్ అధికారిపై ఏకంగా సస్పెన్షన్ వేటు

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): మహారాష్ట్రలో ఉన్నతాధికారుల తీరుపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. పర్యావరణ శాఖ మంత్రి పంకజా ముండే పిలిచిన సమీక్షా సమావేశానికి డుమ్మా కొట్టారని, మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ దేవేంద్ర సింగ్, జాయింట్ డైరెక్టర్ సతీష్ పద్వాల్లను సస్పెండ్ చేస్తూ అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నారు.

అసెంబ్లీ వేదికగా సంచలన నిర్ణయం..

చంద్రాపూర్ జిల్లాలోని కాలుష్య నివారణ చర్యలపై శాసనసభలో చర్చ జరుగుతున్న సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై తాను పిలిచిన బ్రీఫింగ్ సమావేశాలకు ఎంపీసీబీ అధికారులు వరుసగా గైర్హాజరవుతున్నారని మంత్రి పంకజా ముండే సభ దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల సమన్వయ లోపం వల్ల ప్రజా సమస్యలపై సమాధానం చెప్పడం ఇబ్బందిగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, మంత్రి ఫిర్యాదుపై ప్రోటెమ్ స్పీకర్ దిలీప్ లాండే తీవ్రంగా స్పందించారు. ప్రజాప్రతినిధులు పిలిచిన సమావేశాలకు రాకపోవడం అనేది సభా మర్యాదను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఇది ప్రజలను అవమానించడంతో సమానమని ప్రోటెమ్ స్పీకర్ దిలీప్ లాండే వ్యాఖ్యానించారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. సభ జరుగుతుండగానే సదరు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన ఆదేశించారు.

మరోవైపు సస్పెన్షన్ వెనుక రాజకీయ కారణాలు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. ఎంపీసీబీ విభాగం ప్రస్తుతం శివసేన షిండే వర్గం నేత సిద్ధేష్ కదమ్ ఆధ్వర్యంలో ఉండగా.. పర్యావరణ శాఖ మంత్రిగా బీజేపీ నేత పంకజా ముండే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిత్రపక్షాల మధ్య సమన్వయ లోపం అధికారుల సస్పెన్షన్ వరకు దారితీసిందని ప్రచారం జరుగుతోంది. ఇక బీజేపీ ఎమ్మెల్యే సుధీర్ ముంగంటివార్ ఐఏఎస్ అధికారిపై ప్రివిలేజ్ మోషన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

# దేశవ్యాప్త హెచ్‌పివి టీకా కార్యక్రమానికి శ్రీకారం

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): గర్భాశయ క్యాన్సర్ నివారణ లక్ష్యంగా చేసుకున్న మోడీ ప్రభుత్వం హెచ్‌పివి వ్యాక్సిన్ ను ఉచితంగా అందిస్తుంది. ఇందులో భాగంగా శనివారం రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ 14 ఏళ్ల బాలికల కోసం జాతీయ స్థాయి హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారి నుంచి దేశంలోని యువతులను రక్షించడమే లక్ష్యంగా ఈ బృహత్తర పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకు వచ్చింది.

హెచ్‌పివి వ్యాక్సిన్ ముఖ్య లక్ష్యం

ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని సుమారు 1.15 కోట్ల మంది 14 ఏళ్ల బాలికలకు ఈ టీకాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎంతో ఖరీదైన వ్యాక్సిన్‌ను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. దేశవ్యాప్తంగా నిర్దేశించిన అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ టీకాలు అందుబాటులో ఉంటాయి. గర్భాశయ క్యాన్సర్ అనేది మహిళల్లో ప్రాణాంతకంగా మారుతున్న నేపథ్యంలో, చిన్న వయస్సులోనే ఈ టీకా ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఆ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా ఉచితంగా 14 బాలికలకు ఈ హెచ్‌పివి వ్యాక్సిన్ అందించనున్నారు.

# పరీక్షా కేంద్రంలో విషాద ఘటన టాయ్‌లెట్‌లో మృత శిశువు జననం

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ మైనర్ విద్యార్థి టాయ్‌లెట్‌లో మృత శిశువుకు జన్మనిచ్చింది. ఈ దిగ్భ్రాంతికరమైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో వెలుగుచూసింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ 16 ఏళ్ల మైనర్ బాలిక, పరీక్షా కేంద్రంలోని మరుగుదొడ్డిలో మృత శిశువుకు జన్మనిచ్చింది. ఇంగ్లిష్ పరీక్ష రాయడానికి వచ్చిన ఆ విద్యార్థిని, పరీక్ష ప్రారంభమైన కొంతసేపటికే ఇన్విజిలేటర్ అనుమతి తీసుకుని టాయ్‌లెట్‌కు వెళ్లింది. అయితే, ఎంతసేపటికీ ఆమె తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన సిబ్బంది వెళ్లి చూడగా అసలు విషయం బయటపడింది.

మరుగుదొడ్డి నుంచి బయటకు వస్తున్న బాలిక నడకలో తడబాటు ఉండడాన్ని గమనించిన పరీక్షా కేంద్రం సిబ్బంది, లోపలికి వెళ్లి చూడగా బాత్రూం బేసిన్‌లో మృత శిశు వు పడి ఉండటాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. సమాజంలో పరువు పోతుందనే భయంతోనే తాను ఎవరికీ అనుమానం రాకుండా శిశువును బేసిన్‌లో కుక్కినట్లు సదరు మైనర్ బాలిక విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. ఆ బాలిక గర్భం దాల్చడానికి కారణమైన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసే అవకాశం ఉంది. విద్యాసంస్థల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

# ఉరేసుకుని మహిళా కానిస్టేబుల్ బలవన్మరణం

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఓ మహిళా కానిస్టేబుల్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ పట్టణంలోని గంగారం సాయిబాబా కాలనీలో నివాసం ఉంటున్న మహిళా పోలీస్ కానిస్టేబుల్ దివ్య శనివారం ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వికారాబాద్ పట్టణ పోలీసులు వెంటనే స్పాట్‌కు చేరుకుని దర్యాప్తును ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వికారాబాద్ సీఐ రఘు కుమార్ మాట్లాడుతూ.. మృతురాలు దివ్య ధారూర్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్నట్లుగా తెలిపారు. దివ్య సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకుందని, ఆ లేఖలో 'తన చావుకు ఎవరూ కారణం కాదని.. నాన్న లేకపోవడం వల్లే మనకు ఇన్ని బాధలు' అని మాత్రమే ఉందని సీఐ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యతో కుటుంబ సభ్యులు, సహచరులు, కాలనీ వాసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయితే, పోలీస్ శాఖలోని ఉన్నతాధికారుల నుంచి దివ్యపై ఏమైనా ఒత్తిడి ఉందా..? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

# స్టవ్‌లు రిపేర్ చేసుకునే వ్యక్తిని వరించిన అదృష్టం లాటరీలో రూ.3 కోట్లు గెలుపు

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): అదృష్ట దేవత ఎప్పుడు ఎవరి తలుపు తడుతుందో చెప్పలేమని చాలామంది అంటుంటారు. తాజాగా అలాంటి ఘటనే జరిగింది. స్టవ్‌లు రిపేర్ చేసుకునే వ్యక్తికి ఏకంగా రూ.3 కోట్ల లాటరీ తగిలింది. పంజాబ్ లోని మోగా జిల్లా నిహాల్‌సింగ్ వాలా పట్టణానికి చెందిన మహేంద్రసింగ్.. స్టవ్‌ల రిపేర్ల దుకాణం నడుపుతున్నాడు.

అతడిని అనూహ్యంగా అదృష్టలక్ష్మి వరించింది. గురుగ్రామ్ ఆలయంలో పూజలు చేసి తిరిగివస్తూ పత్రాన్ మార్కెట్‌లో కనిపించిన ఓ లాటరీ దుకాణంలో ఆయన లాటరీ టికెట్ కొన్నారు. అది నాగాలాండ్ రాష్ట్ర 'డియర్ మహా శివరాత్రి బంపర్ 2026' లాటరీ. అయితే మహేంద్రసింగ్ కొన్న టికెట్‌కు మొదటి బహుమతి తగలడంతో ఆయన రూ.3 కోట్లు గెలుచుకున్నారు.

జీవనోపాధి కోసం స్టవ్ రిపేర్ దుకాణం నడుపుతున్న మహేంద్రసింగ్‌కు లాటరీ తగిలిందన్న విషయం పట్టణమంతా తెలియడంతో.. ఆయన తన కుటుంబసభ్యులు, స్థానికులతో కలిసి ఈ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ లాటరీ బంపర్ డ్రా ఫిబ్రవరి 21న తీశారు. ఏజెంట్ కమిషన్, ఇతర మినహాయింపులు పోగా రూ.1.80 కోట్లకు పైగా మహేంద్రసింగ్ చేతికి అందనుందని చెబుతున్నారు.

# ప్రభుత్వాసుపత్రికి మారువేషంలో కలెక్టర్.. రోగి లాగా ప్రవేశం

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా వినూత్న రీతిలో రంగంలోకి దిగారు. గుంటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించేందుకు ఆమె ఇవాళ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.

సామాన్యురాలిలా తనిఖీ.. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా, గుర్తు పట్టకుండా ముఖానికి మాస్క్ ధరించి ఒక సాధారణ బాధితురాలిలా కలెక్టర్ ఆసుపత్రిలోకి వెళ్లారు. ఓపీ కౌంటర్లు, వార్డులను సందర్శించి అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న బాధితులు, వారి కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న భోజనం, మందులు, ఇతర వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్‌పైనే దురుసు ప్రవర్తన.. తనిఖీ సమయంలో ఒక విస్తుపోయే సంఘటన చోటుచేసుకుంది. వచ్చిన వ్యక్తి జిల్లా కలెక్టర్ అని తెలియని కొందరు ఆసుపత్రి సిబ్బంది ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించారు. సామాన్య ప్రజల పట్ల సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా, కఠినంగా వ్యవహరిస్తున్నారో ఈ ఘటనతో కలెక్టర్‌కు ప్రత్యక్షంగా అర్థమైంది.

# కన్నతల్లిని సజీవ దహనం చేసిన కొడుకు

న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): జన్మనిచ్చిన కన్నతల్లిని పువ్వుల్లో పెట్టుకుని చూసుకోవాల్సింది పోయి మద్యం మత్తులో ఓ కిరాతకుడు కొడుకు విచక్షణ కోల్పోయాడు. ఇన్నాళ్లు కంటికి రెప్పలా సాకిందనే జాలి, దయ, కరుణ మాతృమూర్తినే అత్యంత అమానుషంగా సజీవ దహనం చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోటగిరికి చెందిన భూమవ్వ అనే వృద్ధురాలి కుమారుడు గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. శనివారం కూడా మద్యం మత్తులో ఉన్న అతడు తాగేందుకు డబ్బులివ్వాలని తల్లితో తీవ్రంగా వాగ్వాదానికి దిగాడు. కోపంతో ఊగిపోయిన ఆ కసాయి కొడుకు, తన తల్లిని చంపాలని నిర్ణయించుకున్నాడు.

పాత బట్టలు వేసి నిప్పంటించి..

అమాయకపు తల్లి అని కూడా చూడకుండా, ఇంట్లో ఉన్న పాత బట్టలను ఆమెపై వేసి నిప్పంటించాడు. మంటలు అంటుకుని భూమవ్వ కేకలు వేస్తున్నా కనికరించకుండా అలాగే చూస్తూ ఉండిపోయాడు. తీవ్రమైన మంటల ధాటికి ఆ వృద్ధురాలు అక్కడికక్కడే సజీవ దహనమై ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న కోటగిరి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కన్నతల్లిని నిప్పుపెట్టి చంపిన ఆ కసాయి కొడుకును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టాడా..? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

# విజయ్, ఓపీఎస్, శశికళ మద్దతుతో స్టాలిన్‌కు 2009 ఏపీ రిపీట్ అవకాశం

మొదటి పేజీ తరువాయి

అయితే చిన్నమ్మ ప్రభావం ఎన్నికలపై ఎంత వరకు ఉంటుందనేది చూడాలి. ఆమె ప్రభావం ఎంతగా ఉంటే.. డీఎంకేకు అంత కలిసి వస్తుంది.

ఇక తమిళనాడు ఎన్నికల్లో కీలకమైన ఫ్యాక్టర్ హీర్ విజయ్ నాయకత్వంలోని టీవీకే. విజయ్‌కి యువతలో విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. ఈ ఎన్నికలు తనకు, స్టాలిన్‌కు మధ్య పోరు అని విజయ్ ప్రకటించారు. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన సొంతంగా అధికారంలోకి రావడం కష్టం, అయితే ఆయన పార్టీ ఎంత మేర ఓట్లు చీల్చుతుంది అనేదానిపై ప్రత్యర్థి పార్టీల జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. 20 శాతం వరకు ఓటు బ్యాంక్ ఉండొచ్చని భావిస్తోన్న విజయ్ పార్టీ కింగ్ మేకర్ అవుతుందా? లేదా ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును చీల్చడం ద్వారా డీఎంకే విజయానికి పరోక్షంగా సహకరిస్తుందా అనేది చూడాలి.

అన్నాడీఎంకే కూటమిలో బీజేపీతోపాటు అన్బుమణి రామ్ దాస్ వర్గానికి చెందిన పీఎంకే, శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్‌కు చెందిన ఏఎంఎంకే, తమిళ మానిల కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి.

అయితే అన్నాడీఎంకేతో గతంలో కలిసి పని చేసిన డీఎండీకే అనూహ్యంగా డీఎంకే గూటికి చేరింది. దివంగత విజయ్‌కాంత్ భార్య ప్రేమలత ఈ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. ఓపీఎస్ సైతం డీఎంకేలో చేరారు. కాంగ్రెస్, వీసీకే, కమల్ హాసన్‌కు చెందిన మక్కల్ నీది మయ్యమ్‌తోపాటు లెఫ్ట్ పార్టీలు డీఎంకేతో ఉన్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీతో సీట్ల పంపకం విషయమై కొద్దిగా పొరపొచ్చాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.


స్థూలంగా చూస్తే.. ఓపీఎస్ తన వైపు చేరడంతోపాటు.. విజయ్, శశికళ రూపంలో ప్రతిపక్ష అన్నాడీఎంకే ఓటు బ్యాంక్‌కు గండిపడే అవకాశం కనిపిస్తోంది. అదీగాక తమిళ తంబీలను తనవైపు తిప్పుకోవడంలో బీజేపీ ఇప్పటికీ ఆశించినంత సక్సెస్ కావడం లేదు. అన్నాడీఎంకే గెలిస్తే బీజేపీ రాష్ట్రాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుంటుందనే భయం కూడా తమిళు ల్లో ఉంది. ఇవన్నీ కలిసి స్టాలిన్ వరుసగా రెండోసారి సీఎం కావడానికి లైన్ క్లియర్ చేస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంటే, 2009లో ఏపీలో వైఎస్ ఎలా అధికారంలోకి రాగలిగారో ఇప్పుడు తమిళనాడులో స్టాలిన్ అలాంటి సీన్ రిపీట్ చేసే ఛాన్స్ ఉందన్నమాట.

# కాకినాడ పేలుళ్లు.. మృతి చెందింది వీరే..!



న్యూస్ డెస్క్, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో సూర్య ఫైర్ వర్క్స్ లో జరిగిన ప్రమాదంలో 21 మంది మృతి చెందారు. టపాసులు ఒక్కసారిగా పేలడంతో కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రమాద సమయంలో పరిశ్రమలో మొత్తం 34 మంది కూలీలు పని చేస్తున్నారు. పేలుడు ధాటికి ఘటనాస్థలంలో 21 మంది సజీవ దహనం అయ్యారు. మరో 9 మందికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే మృతుల్లో ఇప్పటివరకు 11 మందిని గుర్తించారు. అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా గుర్తించారు. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

# చిట్టిగిద్ద, గొల్లగూడ రైల్వే స్టేషన్లలో రైలు నిలుపుదలకు చొరవ



ఇది కద నిజం : చిట్టిగిద్ద మరియు గొల్లగూడ రైల్వే స్టేషన్లలో రైళ్లు ఆగేలా తక్షణ చర్యలు చేపట్టినందుకు గాను స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ వినతిపై సానుకూలంగా స్పందించి, రైలు నిలుపుదల విషయమై ఇప్పటికే సెంట్రల్ రైల్వే అధికారులకు లేఖ రాసినట్లు ఎంపీ కార్యాలయం నుండి సమాచారం అందడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం రైల్వే సమస్యలే కాకుండా, గ్రామాల అభివృద్ధికి సంబంధించి ఎంపీ తన సొంత నిధులతో పనులు చేపడతానని హామీ ఇవ్వడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి సత్వరమే స్పందించడం ఎంపీ ప్రజాహిత దృక్పథానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు మరియు రైల్వే సమస్యపై స్పందించిన తీరును కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారాన్ని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం , బీజేపీ నవాపేట మండలం అధ్యక్షులు ఎస్. చంద్రకాంత్, బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ ఎస్. రమేష్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు బి. గలయ్య , వట్టి మీనాపల్లి సర్పంచ్ శేఖర్ రెడ్డి, చిట్టిగిద్ద సర్పంచ్ శ్రీధర్, ఉప సర్పంచ్‌లు మహేందర్ (గొల్లగూడెం), అర్జున్ (చిట్టిగిద్ద), దీరత్ రెడ్డి (నాగిరెడ్డి పల్లి), వార్డు సభ్యులు భీమ్ రెడ్డి, మల్లేశం, ఎస్సీ మండలం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు నర్సిములు, రమేష్, మాణిక్యం తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# చిట్టిగిద్ద అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల వికాసానికి కృషి



ఇది కద నిజం ,నవాబుపేట: మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్వాడీ టీచర్ హంసవేణి తెలిపారు. పౌష్టికాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా కేంద్రంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పాలు, గుడ్లు క్రమం తప్పకుండా అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కేంద్రంలో ప్రస్తుతం 20 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నామని హంసవేణి వివరించారు. చదువుతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కాలానుగుణంగా టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు పిల్లలకు మరింత మెరుగైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు. అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారుల కోసం ఆటబొమ్మలు, విద్యా సంబంధిత చార్టులు, ఇతర ఆట వస్తువుల అవసరం ఉందని ఆమె తెలిపారు. ఎవరైనా ఉదార స్వభావం కలిగిన దాతలు ముందుకు వచ్చి ఈ వస్తువులను సమకూర్చాలని ఆమె కోరారు. దాతల సహకారం ఉంటే చిన్నారులకు మరింత ఉత్సాహంగా అభ్యాసం సాగుతుందని హంసవేణి ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదల వైద్య సేవలకు ప్రాముఖ్యత



ఇది కద నిజం ,సికింద్రాబాద్ : సితఫలమండీ లో ని కుట్టి వెల్లోడి ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నిర్మాణం పనులను స్థానిక శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో పేదలకు మంచి వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని, ఈ క్రమంలో స్థానికంగా పేరొందిన కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రికి కొత్త భవన సముదాయాన్నినిర్మించే పనులు వేగంగా చేపతున్నామని తెలిపారు. అదే విధంగా లాలాపేట లో రూ.13.05 కోట్లు, అడ్డగుట్ట లో రూ.13.05 కోట్ల ఖర్చుతో కొత్త ఆసుపత్రి భవనాల నిర్మాణం పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పనుల్లో నాణ్యతను పాటించాలని, సూపర్ స్పెషాలిటి సేవలు అందించేలా ఏర్పాట్లు జరపాలని అధికారులను ఆదేశించారు. బీ.ఆర్.ఎస్. సమన్వయకర్త రాజ సుందర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మంగళ్‌హాట్‌లో సంచలనం రేపిన హత్య కేసు ఛేదన

## ఐదుగురు అరెస్ట్.. కీలక ఆధారాలు స్వాధీనం



ఇది కద నిజం :హైదరాబాద్‌లోని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన రుషబ్ అగర్వాల్ ఏ సన్నీ అగర్వాల్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఘటనలో పాల్గొన్న ఐదుగురు సభ్యులతో కూడిన ముఠాను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండు యాక్టివా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో మున్నా సింగ్ (31), లడ్డు సింగ్ (30), మద్దూర్ ప్రణయ్ కుమార్ (30), తిప్పని ఉదయ్ కిరణ్ (20), కుశంగల్ ఓం ప్రకాష్ (20) ఉన్నారు. అమ్రేష్ @ అమినేష్ సింగ్, కునాల్ సింగ్, మాము పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, ఇటీవల జైలు నుంచి విడుదలైనట్లు చెప్పిన రుషబ్, చర్లపల్లి జైలులో ఉన్న సమయంలో మున్నా సింగ్ పాత శత్రువులు తనను కలిసినట్లు మున్నా సింగ్‌కు తెలిపాడు. ఈ విషయం తెలిసిన తర్వాత మున్నా సింగ్‌కు అతనిపై తీవ్ర అనుమానం పెరిగింది. సమాచారం తెలుసుకునే నెపంతో రుషబ్‌ను ఓ షెడ్‌కు పిలిపించి దాడి చేసి, అనంతరం ఆరాంఘర్ ప్రాంతంలోని గణేష్ తయారీ యూనిట్‌కు తరలించి దారుణంగా కొట్టారు. తీవ్ర అంతర్గత గాయాలతో రుషబ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి ఫిబ్రవరి 27న అరెస్టు చేశారు. ఈ కేసు ఛేదన గోల్కొండ జోన్ డీసీపీ శ్రీ జి. చంద్ర మోహన్ పర్యవేక్షణలో, మంగళ్‌హాట్ సీఐ శ్రీ ఎస్. రాఘవేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది..

# తెలంగాణ ఉద్యమకారుల విస్మరణ

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమ నేత కావాలి శేఖర్ ధ్వజం



ఇది కద నిజం : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని తెలంగాణ ఉద్యమకారుడు కావాలి శేఖర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. నాడు బి.ఆర్.ఎస్ ప్రభుత్వం కూడా ఉద్యమకారులను పట్టించుకోకుండా కాలయాపన చేసిందని, నేడు కాంగ్రెస్ కూడా అదే బాటలో పయనించడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులను జారీ చేయాలని కావాలి శేఖర్ డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొన్న విధంగా ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, అలాగే వారి జీవనోపాధి కోసం ప్రతి నెలా పెన్షన్ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎంతో మంది ఉద్యమకారులు నేడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా, పాలకులకు వారి కష్టాలు పట్టడం లేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది ఉద్యమకారుల త్యాగాల వల్లనే అన్న విషయాన్ని ప్రభుత్వం మరువకూడదని శేఖర్ గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తాము ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమకారులందరినీ ఏకం చేసి తమ హక్కుల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

## మెడికల్ మాఫియాకు

# అడ్డుకట్ట వేయాలి

- సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య



ఇది కద నిజం, కుక్కునూరు: ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియాను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని కుక్కునూరు మండల సీపీఐ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధిష్టానం ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. నాణ్యత లేని, కల్తీ మందులు విచ్చలవిడిగా విక్రయిస్తూ మెడికల్, ఫార్మా రంగం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మండిపడ్డారు. కార్పోరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం వెళితే లేనిపోని పరీక్షలు, మందులు రాసి డబ్బు కోసం రోగులను జలగల్లా పట్టి పీడిస్తున్నారని ఆరోపించారు. మెడికల్, ఫార్మా కంపెనీలు పాల్పడుతున్న అక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. అనంతరం కుక్కునూరు ఎమ్మార్వో రమేష్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, గుంటుపల్లి రాజేష్ పాల్గొన్నారు.

## అబ్బురపరిచిన

# శ్లోక స్కూల్ సైన్స్ ఫెయిర్




ఇది కద నిజం, కుక్కునూరు: నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్లోక కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో శనివారం సైన్స్ ఫెయిర్ (విజ్ఞాన ప్రదర్శన) ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనను పాఠశాల కరస్పాండెంట్లు రిబ్బన్ కట్ చేసి అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెడుతూ నిర్వహించిన సైన్స్ ఫెయిర్ సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. తమ మేధస్సుతో విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు భవిష్యత్ శాస్త్రవేత్తలకు వీరు ఏమాత్రం తీసిపోరని నిరూపించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మొలిశెట్టి యుగంధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న వినూత్న ఆలోచనలను వెలికి తీయడానికి ఇలాంటి వేదికలు ఎంతో దోహద పడతాయన్నారు. అనంతరం కుక్కునూరు ఉపసర్పంచ్ పిచ్చుక రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం థియరీలకే పరిమితం కాకుండా నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను చూపారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు శ్లోక స్కూల్ యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు వనమా భాగ్యలక్ష్మి, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది మాచర్ల పోతురాజు, నిమ్మల ప్రసాద్, ములిశెట్టి జయంత్, జగదీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా

# 30 పోలీస్ యాక్ట్ అమలు

## పోలీసు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు బహిరంగసభలు నిర్వహించవద్దు



సూర్యాపేట, 28 ఫిబ్రవరి (ఇది కద నిజం): శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా, సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మార్చి 1 వ తేది నుండి, నెల రోజుల వరకు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా, ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు, చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే, 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవు అని తెలిపారు. బాణాసంచా, DJ లు ఉపయోగించవద్దు అన్నారు.

# సినిమా న్యూస్



## నెగటివ్ రూమర్స్ పట్టించుకోను

సూపర్ స్టార్ రజినీకాంత్, డైరెక్టర్ సిబి చక్కవర్తి కాంబినేషన్‌లో 'THALAIVAAR173'ని రీసెంట్‌గా అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో దర్శకుడు బాసిల్ జోసెఫ్ అండ్ హీరోయిన్ ప్రియాంక మోహన్ కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు నెట్టింట వార్తలు వస్తున్న క్రమంలో.. వీటిపై క్లారిటీ ఇచ్చింది ప్రియాంక. సిబి చక్రవర్తి డైరెక్షన్‌లో వచ్చిన 'డాన్' మీకు పెద్ద హిట్ ఇచ్చింది. ఇప్పుడు ఆయన చేస్తున్న రజనీకాంత్ సినిమాలో మీరు నటిస్తున్నారా అనే ప్రశ్నపై ప్రియాంక మోహన్ స్పందిస్తూ.. 'రజనీ సర్ సినిమా కథ ఏమిటో నాకు తెలియదు. నేను అందులో భాగం అవుతానో లేదో నాకు ఖచ్చితంగా తెలియదు. అయితే.. 'డాన్' పెద్ద హిట్. ఆ తర్వాత సిబి నెక్స్ట్ ఏ మ్యాజిక్ చేయబోతున్నాడా అని 'డాన్' టీం ఆసక్తిగా ఎదురుచూసింది.

సిబి సర్ ఇప్పుడు రజనీ సర్‌తో సినిమా చేస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఆయన రజనీ సర్‌కి పెద్ద ఫ్యాన్' అని తెలిపింది. అలాగే సోషల్ మీడియాలో వచ్చే రూమర్స్ గురించి మాట్లాడుతూ.. 'నేను ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అండ్ ఇతర అన్ని ప్లాట్‌ఫామ్‌లలో యాక్టీవ్‌గా ఉంటాను. అలాగే నా టీమ్ అంతా చూసుకుంటుంది. సోషల్ మీడియాలో వచ్చే నెగిటివ్ వార్తలను నేను పట్టించుకోను. ఎందుకంటే ప్రతి వారం ఏదో ఒక కొత్త పుకారు వస్తూనే ఉంటుంది. కొంతకాలం తర్వాత ప్రజలు వేరే కొత్త పుకారు కోసం సిద్ధం అవుతారు. అందుకే వాళ్లు సృష్టించే నెగిటివ్ వార్తలు నేను పట్టించుకోను' అంటూ చెప్పుకొచ్చింది ప్రియాంక.

## మృత్యుంజయ

### ట్రైలర్ లాంచ్ చేసిన ఎన్టీఆర్




టాలీవుడ్‌లో విభిన్నమైన కంటెంట్‌తో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'మృత్యుంజయ'. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ సినిమా ట్రైలర్‌ను మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ శనివారం విడుదల చేశారు. ట్రైలర్ కట్ చూస్తుంటే, శ్రీవిష్ణు ఖాతాలో మరో సాలిడ్ హిట్ పడటం ఖాయమనిపిస్తోంది.

శ్రీవిష్ణు గత చిత్రాల కంటే భిన్నంగా 'మృత్యుంజయ'లో చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ చేసిన అనంతరం ఎన్టీఆర్ చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. శ్రీవిష్ణు నటన, నేపథ్య సంగీతం, విజువల్స్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌కు నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. "శ్రీవిష్ణు అన్న.. అసలు ఎలాంటి కంటెంట్ కావాలనుకున్నానో సరిగ్గా అలాంటి ట్రైలర్ ఇచ్చావు" అంటూ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. కాగా ఈ చిత్రం మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులకు 'మృత్యుంజయ' ఒక మంచి ట్రీట్ అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తారక్ సపోర్ట్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి.


## మగాళ్ల రాజ్యంలో

### హీరోయిన్ల పరిస్థితి ఇదే



సినీ పరిశ్రమలో రంగుల లోకానికి వెనుక ఎన్నో చేదు నిజాలు ఉంటాయి. ముఖ్యంగా హీరోయిన్ల ఎంపికలో హీరోల ఆధిపత్యం ఎంత ఉంటుందనే దానిపై ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుంది. తాజాగా ఇదే విషయంపై తాప్సీ పన్ను సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో హీరోయిన్ల తలరాతను హీరోలే రాస్తారని, దర్శకుడు గట్టివాడైతే తప్ప అక్కడ తనలాంటి వారికి చోటు దక్కడం కష్టమని ఆమె షాకింగ్ కామెంట్స్ చేసింది. "నేను మాట్లాడే మాటల వల్ల అవకాశాలు పోయాయో లేదో నాకు ప్రత్యక్షంగా తెలియదు. ఎందుకంటే ఎవరైనా నాతో పని చేయడం ఇష్టం లేకపోతే ఆ విషయం నా వరకు చేరదు. కానీ, ఇండస్ట్రీలో ఒక చేదు నిజం ఉంది. హీరో-హీరోయిన్ ఉన్న సినిమాల్లో హీరోయిన్ ఎవరనేది చాలా వరకు హీరోలే నిర్ణయిస్తారు. దర్శకుడు గనుక స్టార్ డైరెక్టర్ అయితే తప్ప, మిగతా సమయాల్లో హీరోల మాటే నడుస్తుంది. మగాళ్ల రాజ్యంలో హీరోయిన్ల పరిస్థితి దారుణంగా ఉంటుంది. వాల్లు వద్దు అంటే అవకాశం ఇచ్చినప్పటికీ తొలగిస్తారు" అని తాప్సీ పేర్కొన్నారు. తన కెరీర్‌లో 'డంకీ' చిత్రం ఒక పెద్ద మలుపు అని తాప్సీ గుర్తు చేసుకున్నారు. "రాజ్‌కుమార్ హిరానీ సార్ నన్ను ఆ సినిమాలో ఉండాలని బలంగా కోరుకున్నారు. అందుకే నేను షారుఖ్ ఖాన్ సార్ పక్కన నటించగలిగాను. నేను సాధారణంగా షారుఖ్ సార్‌తో నటించే హీరోయిన్ల సర్కిల్‌లో లేను కాబట్టి, ఆ వార్త చాలామందికి పెద్ద షాక్ ఇచ్చింది. ఒకవేళ దర్శకుడు అంత పట్టుబట్టకపోయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో" అని చెప్పుకొచ్చారు. ఇక తన గురించి వినిపించే విమర్శలపై స్పందిస్తూ.. "నేను పని చేయడానికి కష్టమైన వ్యక్తినని కొందరు అంటుంటారు. కానీ నా ఫిల్మోగ్రఫీ చూస్తే, నాతో పనిచేసిన దర్శకులు నన్ను మళ్ళీ మళ్ళీ తమ సినిమాల్లో తీసుకున్నారు. డిఫికల్ట్ వ్యక్తులతో ఎవరూ పదే పదే పని చేయరు కదా? నేను పెద్దగా సోషల్ పర్సన్‌ను కాదు, పార్టీలకు వెళ్ళను. అందుకే నాతో పనిచేయని వారు నా గురించి ఇలాంటి అంచనాలకు వస్తుంటారు. నా పని మాత్రమే సమాధానం చెబుతుందని నేను నమ్ముతాను" అని తాప్సీ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

## రణబాలి.. నుండి విజయ్-రష్మికల 'ఏందయ్యసామీ' సాంగ్ వైరల్!



నిజ జీవితంలో ఒక్కటైన టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, ఇప్పుడు వెండితెరపై కూడా 'పెళ్లి' సందడితో పలకరించారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. 19వ శతాబ్దపు బ్రిటిష్ పాలన కాలం నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో విజయ్ దేవరకొండ 'రణబాలి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా, రష్మిక 'జయమ్మ'గా కనిపిస్తోంది. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి వీరిద్దరి పెళ్లికి సంబంధించిన ఒక స్పెషల్ సాంగ్ వీడియో గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు.

'నిజ జీవితంలో ఒకటయ్యారు.. వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యారు" అంటూ చిత్ర యూనిట్ పంచుకున్న ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'ఏందయ్యసామీ..' అంటూ సాగే పాటలో వీరిద్దరి కెమిస్ట్రీ పీక్స్‌లో ఉంది. మునుపటి చిత్రాలు 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' లలో వీరి జోడీకి ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. ఇప్పుడు భార్యాభర్తలుగా మారిన తర్వాత వస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ పెళ్లి సాంగ్ గ్లింప్స్ అభిమానులకు ఫుల్ మీల్స్‌లా ఉంది. ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (మమ్మీ ఫేమ్) విలన్‌గా నటిస్తుండగా, అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. గీత గోవిందం నాటి మ్యాజిక్‌ను మళ్ళీ రిపీట్ చేస్తూ, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.